క్లుప్తంగా

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

వర్ని: మండలంలోని సత్యనారాయణపురం జీపీ పరిధిలోని ఉపాధి హామీ కూలీలకు సర్పంచ్ నియమాని నాగమణి వీర్రాజు ఆధ్వర్యంలో మజ్జిగ, అరటిపండ్లను గురువారం పంపిణీ చేశారు. పీసీసీ డెలిగేట్ కూనిపురి రాజిరెడ్డి, నాయకులు మేక వీర్రాజు, మొహినుద్దీన్, హర్ష, ప్రశాంత్ పటేల్, దామినేని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వడ్డేపల్లి శివాలయంలో ద్వాదశ వార్షికోత్సవం



ఎడపల్లి: మండలంలోని వడ్డేపల్లిలో శివాలయ ద్వాదశ వార్షికోత్సవాన్ని గ్రామస్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 108 జంటలతో రుద్రవనం, రుద్రాభిషేకం చేపట్టారు. మల్లారం మహరాజ్ కార్యక్రమానికి హాజరై యజ్ఞం చేశారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల రక్షణకు నిరంతర పోరాటం



బోధన్: కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ చట్టాలు, హక్కుల రక్షణకు నిరంతరం పోరాటం కొనసాగిస్తామని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రతినిధి సురేష్ అన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను పురస్కరించుకుని గురువారం సాలూర మండల కేంద్రంలో సుత్తికొడవలి గుర్తు ఉన్న ఎర్రజెండాను ఎగురవేశారు. మేడే స్ఫూర్తితో హక్కులను కాపాడుకునేందుకు అన్ని రంగాల కార్మికులను సంఘటితం చేసి పోరాడుతామన్నారు. యూనియన్ సభ్యులు, కార్మికులు జగదీశ్, చందు, మారయ్య పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా శ్రీనివాస్

రెంజల్: మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా సూపరింటెండెంట్ శ్రీనివాస్ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ డిప్యుటేషన్‌పై ఎడపల్లి నుంచి వచ్చిన శంకర్ తిరిగి సొంత మండలానికి వెళ్లగా ఇక్కడ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్‌కు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగిస్తు జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌ను కార్యాలయ సిబ్బంది సన్మానించారు.

గడువులోగా ఓటర్ స్లిప్పులు పంపిణీ చేయాలి



రుద్రూర్: నిర్దేశిత గడువులోగా ఓటర్ స్లిప్పులను పంపిణీ చేయాలని సెక్టార్ ఆఫీసర్ సాయిలు సూచించారు. మండలంలోని రాణంపల్లి, సిద్దాపూర్ గ్రామాల్లో ఓటర్ స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం పరిశీలించారు. ఆయన వెంట బీఎల్‌వోలు, జీపీ సిబ్బంది ఉన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



రుద్రూర్: మండల కేంద్రంలోని పెద్ద చెరువులో కొనసాగుతున్న పూడికతీత పనులను మండల అభివృద్ధి అధికారి సురేశ్ బాబు గురువారం పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున వడదెబ్బకు జాగ్రతలు తీసుకోవాలన్నారు. కూలీల సంఖ్య పెంచాలని, ఉపాధి పనులు చేసే ప్రాంతంలో సౌకర్యాలు కల్పించాలని ఈజీఎస్ సిబ్బందికి సూచించారు.

నేటి నుంచి సభ్యత్వ నమోదు

నిజామాబాద్‌నాగారం: తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మే 3నుంచి 30వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని జిల్లా కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సభ్యత్వం తీసుకోవాలి అనుకునేవారు ఎమ్మెస్సీ సైకాలజీ లేదా ఎమ్మే సైకాలజీ లేదా పీజీ డిప్లమా ఇన్ కౌన్సిలింగ్ గైడెన్స్ పూర్తి చేసిన వారు అర్హులు అన్నారు. ఆసక్తిగల వారు 9849230134, 9948297332ను సంప్రదించాలన్నారు. సాయి కుమార్, వంగ శ్రీహరి, నరేందర్, వెంకటేశ్వర రావు, రవీందర్ పాల్గొన్నారు.

కూల్చివేతలపై పునరాలోచించరూ..

- ఎస్సారెస్పీ క్వార్టర్లను తమకు ఇవ్వాలంటున్న నిరుపేదలు
- గతంలో అడిగిన రిటైర్డ్ ఉద్యోగులు



ఎస్సారెస్పీ కాలనీలో సగం కూల్చివేసిన క్వార్టర్

బాల్కొండ: ఎస్సారెస్పీ కాలనీలో ప్రాజెక్ట్ అధికారులు స్థానికంగా ఉండి ప్రాజెక్ట్‌ను కాపాడేందుకు ప్రాజెక్ట్ నిర్మాణ కాలంలోనే గత ప్రభుత్వం 830 క్వార్టర్లను నిర్మించింది. కానీ ప్రాజెక్ట్ నిర్మాణం నుంచి ఉద్యోగులకు పదవీ విరమణలే తప్ప కొత్తగా ఉద్యోగులు రాక పోవడం, పలు డివిజన్లకు తరలి పోవడంతో క్వార్టర్లు ఖాళీగా ఏర్పడ్డాయి. దీంతో క్వార్టర్లు కాలం చెల్లినవంటూ ఆర్‌అండ్‌బీ అధికారులు మూడేళ్ల క్రితం ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. అయినా సొంత పూచీకత్తుపై కొందరు పేదలు ఆ క్వార్టర్లలో నివాసం ఉంటు ప్రభుత్వం నిర్ణయించిన అద్దెను చెల్లిస్తున్నారు. కానీ ప్రాజెక్ట్ అధికారులకు క్వార్టర్ల నిర్వహణ భారం కావడంతో పాటు క్వార్టర్లు కబ్జాకు గురవుతున్నాయంటు అధికారులు వాటిని కూల దోస్తున్నారు. కూలదోసే బదులు ఇళ్లు లేని తమకు అప్పగిస్తే మరమ్మతులు చేయించుకుంటామని నిరుపేదలకు పేర్కొంటున్నారు. కానీ అధికారులు కబ్జాలను అడ్డుకోలేక కాలం చెల్లిన క్వార్టర్లు అంటు సాకు చూపుతూ కూల దోయడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. 830 క్వార్టర్లలో ఏ, బీ, సీ రకాల క్వార్టర్లు ఉన్నాయి. ప్రభుత్వం స్పందించి ఎస్సారెస్పీ కాలనీలో క్వార్టర్ల కూల్చివేతపై పునరాలోచన చేసి నివాసం ఉంటున్న నిరుపేదలకు అందించాలని పలువురు కోరుతున్నారు.

రిటైర్డు ఉద్యోగుల డిమాండ్..

ప్రస్తుతం ఆ క్వార్టర్లలో రిటైర్డ్ ఉద్యోగులు కొందరు నివాసం ఉంటున్నారు. పెన్షనర్ల పేరుతో కేటాయింపులు చేసుకుని నివాసం ఉంటున్నారు. ప్రభుత్వ క్వార్టర్లను నాగార్జునసాగర్ మాదిరిగా తమకే క్వార్టర్లను కేటాయించాలని కొన్నేళ్ల నుంచి డిమాండ్ చేస్తున్నారు. కానీ క్వార్టర్ల కంటే ముందు భూ సమస్య తలెత్తుతుందని రిటైర్డ్ ఉద్యోగులకు గత ప్రభుత్వాలు కేటాయించలేదు. ఇరిగేషన్ భూమిని రెవెన్యూ అధికారులకు కేటాయించిన తర్వాతే కేటాయింపులు జరగాలని నాటి అధికారులు ప్రతిపాదన చేశారు.

కానీ ఇప్పటికీ వాటికి మోక్షం లభించడం లేదు. పాలకులు స్పందించి ఉన్న వాటిని కూల దోసే బదులు పేద వారికి కేటాయిస్తే ప్రయోజనం ఉంటుంది.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేవు

ఎస్సారెస్పీ కాలనీలో ప్రభుత్వ క్వార్టర్లు పేద ప్రజలకు ఇవ్వాలని ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు లేవు. కాలం చెల్లినవి కావడంతో ప్రమాదాలు జరగకుండా క్వార్టర్లను తొలిగిస్తున్నాం. గతంలోనే ఈ క్వార్టర్లు కాలం చెల్లినవిగా ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు.

– చక్రపాణి, ఈఈ, ఎస్సారెస్పీ

'ఎర్లీబర్డ్'లో ఆర్మూర్ ఫస్ట్

- ఉమ్మడి జిల్లాలో మొదటి స్థానం
- నెలరోజుల్లో రూ. కోటి 68 లక్షల ఆస్తి పన్ను వసూలు



ఆర్మూర్‌టౌన్: మున్సిపాలిటీల్లో నిర్వహణ ఖర్చుకు అవసరమైన సాధారణ నిధి సమీకరణకు పురపాలక ఆర్థిక శాఖ ఎర్లీ బర్డ్ పథకాన్ని ప్రవేశపెట్టింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను ముందస్తుగా చెల్లిస్తే ప్రభుత్వం ఐదు శాతం రాయితీ కల్పించింది. ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ రాజు ఆధ్వర్యంలో ఐదు శాతం ఆస్తిపన్నులు ప్రజలు సద్వినియోగం చేసుకునే విధంగా కరపత్రాలను పంపిణీ చేశారు. అలాగే ప్రధాన చౌరస్తా వద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాన కల్పించారు. ప్రజలు ఈనెల 30లోగా పన్నులు చెల్లించాలని మున్సిపల్ సిబ్బందితో ప్రచార కార్యక్రమాలు సైతం నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఆస్తిపనులో బకాయిలు లేని వారికి మాత్రమే ప్రభుత్వం ఈ అవకాశం కల్పించింది. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో సుమారు 19719 పైన అసెస్‌మెంట్ ఉన్నాయి. అందులో ఏప్రిల్ నెలల్లో 5805 అసెస్‌మెంట్‌కు సంబంధించిన వారు ఆస్తి పనులు చెల్లించారు. ఒక ఏప్రిల్‌లో 29.96శాతం, రూ. కోటి 68లక్షలు వసూలు చేశారు. ఉమ్మడి జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లో ఆర్మూర్ మున్సిపల్ మొదటి స్థానంలో నిలిచింది. ఆర్మూర్ మున్సిపల్‌కు 2024–25 ఏడాదికి రూ. 5 కోట్ల 64ల డిమాండ్ ఉంది.

ప్రజల సహకారంతోనే..

ప్రజలు పన్నులు సకాలంలో చెల్లించి సహకరిస్తే ఆర్మూర్ పట్టణం మరింత సుందరీకరణ చేయవచ్చు. మిగతా ప్రజలు సైతం త్వరగా ఆస్తిపన్నులు చెల్లించి అభివృద్ధికి తోడ్పడాలి. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– వన్నెల్‌దేవి లావణ్య, మున్సిపల్ చైర్‌పర్సన్

బిల్‌కలెక్టర్ల సహకారంతో సాధ్యమైంది

బిల్ కలెక్టర్ల పనితీరుతోనే ఐదు శాతం రాయితీ పన్ను వసూలు సాధ్యమైంది. మున్సిపల్ అభివృద్ధి పథంలో ముందుకెళ్లాలంటే ప్రజలు పన్నులు చెల్లిస్తేనే సాధ్యమవుతుంది. కాగా పుర ప్రజలు 5శాతం రాయితీ 30శాతం ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు.

– రాజు, మున్సిపల్ కమిషనర్

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మాటలు నమ్మొద్దు

- ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి



దేగాంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

ఆర్మూర్: కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి పేర్కొన్నారు. దేగాం, మచ్చర్ల గ్రామాల్లో చాయ్‌పే చర్చ కార్యక్రమాల్లో భాగంగా ఆయా గ్రామాల రైతులతో, ఉపాధి హామీ కూలీలతో గురువారం మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ఎంపీగా అర్వింద్ ఉంటే జిల్లాను మరింత అభివృద్ధి చేసుకోవచ్చని అన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతలు కుమ్మక్కై రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. తాను ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ప్రతీ పల్లెలో ఆగస్టులో ఇళ్ల నిర్మాణాలు చేపడతామని పేర్కొన్నారు. ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. బీజేపీ ఆర్మూర్ అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ విజయ భారతి, మున్సిపల్ మాజీ చైర్మన్ కంచెట్టి గంగాధర్, నూతుల శ్రీనివాస్‌రెడ్డి, కలిగోట గంగాధర్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్, బీజేపీలకు ఓటమి తప్పదు

- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్



ఆత్మీయ సమ్మేళనంలో బాజిరెడ్డి గోవర్ధన్

ఆర్మూర్: ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు ఓటమి తప్పదని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ జోస్యం చెప్పారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మున్నూరు కాపు సంఘం ప్రతినిధులతో గురువారం ఆత్మీయ సమ్మేళన సమావేశం నిర్వహించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బాజిరెడ్డి గోవర్ధన్ ప్రసంగించారు. గత ఎన్నికల్లో కోరుట్ల ప్రజలు అర్వింద్‌కు గట్టి బుద్ధి చెప్పారన్నారు. ఇక కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డితో అభివృద్ధి జరిగే అవకాశమే లేదన్నారు. జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ సర్పంచులు చేసిన అభివృద్ధి పనులకు అధికారులు బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. సమావేశంలో మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలోనే అభివృద్ధి



ఆలూర్‌లో మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్



ఏఆర్‌పీలో ప్రచారం చేస్తున్న జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు

పెర్కిట్/ ఎడపల్లి/ నవీపేట: బీఆర్‌ఎస్ పాలనలోనే తెలంగాణ అభివృద్ధి చెందిందని, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని పార్టీ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ఆలూర్ మండల కేంద్రంలో గురువారం రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు క్లైం మోహన్ రెడ్డి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు. ఎడపల్లి మండలంలోని జానకంపేట, ఏఆర్పీ క్యాంప్, నవీపేట మండలంలోని స్టేషన్ ఏరియా గ్రామంలో బీఆర్‌ఎస్‌కు మద్దతుగా బోధన్ నియోజకవర్గ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విఠల్ రావు ప్రచారం చేశారు. బీజేపీ, కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కె శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీరామ్, నాయకులు శేఖర్ రాజు, మాజీ ఎంపీపీ దేని పోచయ్య, నాయకులు గంగాప్రసాద్, మజీద్, అగ్గు సుమన్, అజయ్ గౌడ్, పెరిక రవి, శ్రీనివాస్, ఖలీల్, షేక్ కరీం, నవీపేటలో నాయకులు నర్సింగ్‌రావు, న్యాలకంటి అబ్బన్న, లోకం నర్సయ్య, అంజలి తదితరులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్‌లో..

డొంకేశ్వర్(ఆర్మూర్): పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ గురువారం డొంకేశ్వర్ మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. పేదలకు పథకాలు అందాలంటే ఒక్క బీఆర్‌ఎస్ పరిపాలనతోనే సాధ్యం అవుతుందన్నారు. ఈ నెల 13న జరిగే పోలింగ్‌లో కారు గుర్తుకే ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవన్ రెడ్డి, ఎంపీ సురేశ్ రెడ్డి పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం



కొత్తపల్లిలో మాట్లాడుతున్న అన్వేష్‌రెడ్డి



దండిగుట్టలో మాట్లాడుతున్న నాయకులు

- రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

బాల్కొండ/ రెంజల్: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను తప్పకుండా అమలు చేస్తామని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి అన్నారు. ముప్కాల్ మండలం కొత్తపల్లి, రెంజర్ల గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ముత్యంరెడ్డి, డీసీసీ డెలిగేట్ జైడి రవి, ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, నాయకులు బద్దం సాగర్ రెడ్డి, ఆకుల రమేశ్ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు సామాజిక న్యాయం లభిస్తుందని రెంజల్ మండల కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని దూపల్లి, దండిగుట్ట గ్రామాల్లో ఉపాధి కూలీల వద్దకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మొబిన్‌ఖాన్, మాజీ జడ్పీటీసీ నాగభూషణంరెడ్డి, మాజీ సర్పంచులు జావీద్, బాబులు, సురేందర్‌గౌడ్, మైని మోహన్, మాజీ విండో చైర్మన్ సాయారెడ్డి, సీనియర్ నాయకులు ధనుంజయ్, చుంచుల రాములు, సాయిబాబాగౌడ్, ఒడ్డెక్క మోహన్, చిలుక అశోక్, డీలర్ సాయిలు, ఆసాని వేణు, పోచయ్య, సగ్గు వెంకటి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

డొంకేశ్వర్/ రుద్రూర్/ నందిపేట్: డొంకేశ్వర్ మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ మాజీ సర్పంచ్ మంగ్లారం పోశన్న హస్తం గూటికి చేరారు. గురువారం ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. పోశన్నతో పాటు పలువురు యువకులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గోడిశరం భూమేశ్ రెడ్డి, గణేశ్ గౌడ్, సుద్ద చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు. రుద్రూర్ మండలంలోని అక్బర్‌నగర్ బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు మాచిని కిష్టయ్య, మాజీ ఉప సర్పంచ్ నీరడి శంకర్, నాయకులు కార్తీక్, అంబం పోశెట్టితో పాటు సుమారు 50 మంది కాంగ్రెస్‌లో చేరారు. వీరికి పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇందూర్ చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు తోట అరుణ్, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర మాజీ కన్వీనర్ యలమంచిలి శ్రీనివాస్‌రావు, నడిపింటి నగేశ్, రాంబాబు, తిగుళ్ల రాజావరప్రసాద్, అక్తర్ ఖాద్రి, ఇక్బాల్ సాయిలు తదితరులు పాల్గొన్నారు. నందిపేట్ మండలంలోని పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేరిన వారిలో సర్పంచుల ఫోరం జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు రామడ పోశెట్టి, నందిపేట సర్పంచ్ సంబారు తిరుపతి, మాజీ ఎంపీపీ కోల రాములు, మాయాపూర్ మాజీ ఉప సర్పంచ్ బేగరి జీవన్, పీఏసీఎస్ మాజీ ఉపాధ్యక్షుడు కొత్తూర్ రాజేశ్వర్, బీఆర్‌ఎస్ నాయకులు ముత్యం, పోస్టు సాయిలు, వి. భూమేశ్ ఉన్నారు. వీరికి ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్, మాజీ ఎమ్మెల్సీ, నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, రాష్ట్ర ఉర్దు అకాడమీ కమిటీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నందిపేట మండల అధ్యక్షుడు మంద మహిపాల్, దశగౌడ్, సాయికృష్ణారెడ్డి, మన్నె సాగర్, నాయకులు పాల్గొన్నారు.



వినయ్‌రెడ్డితో మాజీ సర్పంచ్ పోశన్న



పార్టీలో చేరిన వారికి కండువా వేస్తున్న రవీందర్ రెడ్డి



కాంగ్రెస్‌లో చేరుతున్న నందిపేట నాయకులు

ప్రధాన కూడళ్లలో సెల్ఫీ పాయింట్



ఆర్మూర్‌టౌన్: పార్లమెంట్ ఎన్నికలు–2024 స్వీప్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పరిధిలోని ప్రధాన కూడళ్ల వద్ద సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు స్వీప్ నోడల్ అధికారి, మున్సిపల్ కమిషనర్ రాజు గురువారం తెలిపారు. ఈనెల 13న నిర్వహించే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. మున్సిపల్ డీఈఈ భూమేశ్వర్, ఏఈ రఘు, శానిటరీ ఎస్సై మహేశ్, ఈఈ పూర్ణమౌళి పాల్గొన్నారు.

ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి



రెంజల్: దేశం కోసం.. ధర్మం కోసం బీజేపీని గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డి మోహన్‌రెడ్డి కోరారు. ఎంపీ అభ్యర్థి అర్వింద్‌కు మద్దతుగా గురువారం రెంజల్, నీలా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముస్లిములకు బీజేపీ వ్యతిరేకం కాదని, వారు కూడా బీజేపీకి ఓటేసి మద్దతు తెలపాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులతో రాష్ట్ర ప్రభుత్వాలు నడుస్తున్నాయని తెలిపారు. ఎంపీపీ లోలపు రజని, నాయకులు గోపికృష్ణ, మాజీ ఎంపీటీసీ కిశోర్, వైస్ ఎంపీపీ మోగేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

దత్తసాయి ఆలయంలో అన్నదానం

ఆర్మూర్‌టౌన్: చేపూర్ శివారులోని దత్త సాయి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సంజీవ్, ఎర్మా భూమేశ్వర్, చిట్యాల ఆంజనేయులు, కొనింటి అనిల్, మాధ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో నిర్మించిన అమ్మవారి ఆలయ నిర్మాణానికి స్థానిక పద్మశాలి సంఘం రెండో పంథా సభ్యులు రూ. 21 వేల విరాళాన్ని శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో పద్మశాలీ, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహతి ఆశ్రమానికి..

బాల్కొండ మండల కేంద్రంలోని మహతి ఆశ్రమ విద్యార్థుల కోసం ఆర్మూర్‌కు చెందిన పట్వారీ ప్రగతి తన వంతుగా రూ. ఐదు వేలు విరాళంగా అందజేశారు. అదేవిధంగా ఆశ్రమ విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ సభ్యులు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు గోపికృష్ణ, కార్యదర్శి తులసీ, కోశాధికారి లక్ష్మీనారాయణ, ఆశ్రమ సిబ్బంది నరేశ్, స్వరూప, విద్యార్థులు పాల్గొన్నారు.

నియామకం..

అడ్‌హక్ కమిటీ నియామకం



బోధన్ : బోధన్ బ్రాహ్మణ సేవా సమాజ్ అడ్‌హక్ కమిటీని నియామకం చేసినట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. కమిటీ కన్వీనర్లుగా న్యాయవాదులు నరేశ్ కుమార్ కులకర్ణి, దత్తాత్రిరావు కులకర్ణి నియామకమయ్యారు. పట్టణంలోని దక్షిణ ముఖి హనుమాన్ ఆలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. గతంలో వేసిన కమిటీని రద్దు చేశామని, నూతన కమిటీ ఎన్నిక బాధ్యతను అడ్‌హక్ కమిటీ బాధ్యులకు అప్పగించినట్లు ప్రతినిధులు పేర్కొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	రత్నం (తెలుగు)- 12.30, 06.45, 10.10 టిల్లు స్క్వేర్ – 3.40,
స్క్రీన్-2 –	ప్రేమికుడు – 12.15 మంజుమ్మల్ బాయ్స్ – 03.45 టిల్లు స్క్వేర్ – 6.45, 9.45
స్క్రీన్-3 –	వకీల్‌సాబ్- 11.15, 2.35, 6.05, 9.15
స్క్రీన్-4 –	మంజుమ్మల్ బాయ్స్ (తెలుగు)- 11.30, 9.30 ప్రేమికుడు – 02.30, 6.00

బాలల భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దాలి



బోధన్: బాలబాలికల భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దాలని ఆర్య సమాజ్ ప్రతినిధులు అన్నారు. బాల్య దశ నుంచే పునాది వేయాలన్నారు. విజ్ఞానంతో పాటు పిల్లలను సంస్కార వంతులుగా తయారు చేయాలని సూచించారు. గురువులు, పిల్లల తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తు కోసం దిశా నిర్దేశం చేయాలన్నారు. ఆర్య సమాజ్, దయానంద గోశాల బోధన్ శాఖ అధ్వర్యంలో గురువారం పట్టణ కేంద్రంలోని ఆర్య సమాజ్ ప్రాంగణంలో 8 నుంచి 14 ఏళ్ల వయసు బాలబాలికలకు ఏడు రోజుల పాటు నిర్వహించిన సదాచార ప్రశిక్షణా శిబిరం ముగింపు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శిక్షణా శిబిరం అధ్యాపకులు ఉట్నూర్ పద్మ, వేదమిత్ర, ప్రణవ్ కుమార్, రామలింగం, ఆర్య సమాజ్ ప్రతినిధి ప్రదీప్‌గుప్తా, సభ్యులు, బాలబాలికలు పాల్గొన్నారు.